రేషన్ షాపులపై విజిలెన్స్ దాడులు

- రెండు షాపులను సీజ్ చేసిన అధికారులు
- ఇద్దరు డీలర్లు సస్పెన్షన్, కేసు నమోదు

రేషన్ షాపును సీజ్ చేస్తున్న ఆర్ఐ

రేగొండ, నవంబర్ 5 : మండలంలోని బాగిర్ధిపేటలోని రేషన్ షాపులపై విజిలెన్స్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించినట్లు తహసీల్దార్ శ్వేతారావు తెలిపారు. ఆమె కథనం ప్రకారం.. బాగిర్ధిపేట గ్రామంలోని షాపు నంబర్-5 డీలర్ సూర రమాదేవి, షాపు నంబర్ -6 డీలర్ పెండల సుగుణ లబ్ధిదారులకు బియ్యం ఇవ్వకుండా వేలి ముద్రలు తీసుకొని డబ్బులు ఇస్తున్నారనే సమాచారంతో విజిలెన్స్ అధికారుల బృందం, డిప్యూటీ తహసీల్దార్ ఎండీ రజాక్, ఆర్ఐ నరేశ్ మంగళవారం షాపులను తనిఖీ చేశారు. డీలర్లు సోమవారం ఎంఎల్ఎస్ గోదాంలో వేలిముద్రలు వేశారని, కానీ, వారికి బియ్యం సరఫరా కాకముందు నాలుగు రోజుల నుంచి డీలర్లు లబ్ధిదారుల వేలి ముద్రలు తీసుకొని వారికి డబ్బులు చెల్లించడంతో బియ్యాన్ని షాపులోనే నిల్వ చేశారు. మంగళవారం ప్రజలకు పంపిణీ చేసిన ఆన్‌లైన్ రికార్డుల ప్రకారం షాపు నంబర్-5లో 49 క్వింటాళ్ల 29కిలోలు ఉండాల్సి ఉండగా అదనంగా 8 క్వింటాళ్లు, షాపు నంబర్-6లో 53 క్వింటాళ్ల 23 కిలోలకు 81 క్వింటాళ్ల 34కిలోలు నిల్వ ఉన్నాయన్నారు. అదనంగా 28 క్వింటాళ్ల 23కిలోలు నిల్వ ఉన్నట్లు గుర్తించి రెండు షాపులను సీజ్ చేసినట్లు చెప్పారు. అలాగే వేలి ముద్ర మిషన్లను స్వాధీనం చేసుకొని ఇద్దరు డీలర్లపై కేసు నమోదు చేసి పక్క గ్రామాల డీలర్లు అదనపు బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. వ్యాపారులుగా వ్యవహరిస్తున్న డీలర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు.

ఇండ్ల జాబితా తయారు చేయాలి

- సర్వే ప్రక్రియను 15 రోజుల్లో పూర్తి చేయాలి
- ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజనం తర్వాతే సర్వేలో పాల్గొనాలి
- భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ

టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి రూరల్, నవంబర్ 5 : సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణకు 6, 7 తేదీల్లో ఇండ్ల జాబితా తయారు చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. బుధవారం నుంచి హౌస్ లిస్టింగ్ ప్రారంభం కానున్న నేపథ్యంలో మంగళవారం మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, సూపర్‌వైజర్లతో ఐడీవోసీ కార్యాలయం నుంచి కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 6,7 తేదీల్లో గ్రామ, మున్సిపాలిటీలో ఇంటింటి జాబితా గణనలో ప్రతి ఇంటికి స్టిక్కర్ అంటించాలని, సర్వే పూర్తయిన తర్వాత మార్కర్‌తో తేదీ వేయాలని ఆదేశించారు. 8వ తేదీ నుంచి సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభం కావాలని, ఈ ప్రక్రియ 15 రోజుల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. జిల్లాలోని 12 మండలాలు, భూపాలపల్లి మున్సిపల్ పరిధి కలిపి ఉన్న 1,31,030 ఇండ్ల సర్వే నిర్వహణకు 993 ఎన్యూమరేషన్ బ్లాకులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సర్వే నిర్వహణకు గ్రామీణ ప్రాంతాల్లో 842 మంది, పట్టణ ప్రాంతంలో 92 మందితో కలిపి మొత్తం 934 మంది ఎన్యూమరేటర్లును నియమించామని, రిజర్వ్‌లో 109 మందిని అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల పర్యవేక్షణకు 92 మంది, పట్టణ ప్రాంతానికి 9 మంది, రిజర్వ్‌డ్‌లో 22 మంది, మొత్తం 123 మందిని నియమించామన్నారు. ఎన్యూమరేటర్లుగా పీఎస్ ఉపాధ్యాయులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వీవోఎస్‌లను నియమించినట్లు తెలిపారు. కుల గణనకు 150 ఇళ్లను ఒక ఎన్యూమరేషన్ బ్లాక్‌గా కేటాయించామని, ఒక్కొక్కరు రోజుకు కనీసం పది ఇళ్ల చొప్పున 15 రోజుల్లో 150 ఇళ్ల సర్వే పూర్తి చేయాలన్నారు. ఈబీలను పరిగణనలోకి తీసుకున్నామని, ఎన్యూమరేషన్ బ్లాక్‌లో 150కు మించి ఇళ్లు ఉంటే 150 ఒకరు, పైబడిన ఇళ్లకు అదనంగా ఒక ఎన్యూమరేటర్‌ను నియమించామన్నారు. వివరాలను ఆన్‌లైన్ చేయడానికి డేటా ఎంట్రీ సిబ్బందిని నియమించాలని అధికారులను ఆదేశించారు. నోడల్ అధికారులుగా కాటారానికి సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, భూపాలపల్లికి ఆర్డీవో మంగీలాల్, జిల్లా నోడల్ అధికారిగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మిని నియమించినట్లు తెలిపారు.


దామరంచపల్లెలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న సిరికొండ

మృతుల కుటుంబాలకు పరామర్శ

రేగొండ, నవంబర్ 5 : రేగొండ, గోరికొత్తపల్లి మండలాల్లోని వివిధ గ్రామాల్లో ఇటీవల మరణించిన వారి కుటుంబాలను శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మంగళవారం వేర్వేరుగా పరామర్శించారు. గోరికొత్తపల్లి మండలం దామరంచపల్లెకు చెందిన కొత్త అమృతమ్మ కుటుంబాన్ని మధుసూదనాచారి, రేగొండ మండలం నారాయణపురంగ్రామానికి చెందిన ఏడునూతుల శశిరేఖ, గణపాక సూరమ్మ కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే గండ్ర పరామర్శించారు. వారి వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంకం రాజేందర్, నాయకులు ఇంగే మహేందర్, సామాల పాపిరెడ్డి, కోలెపాక భిక్షపతి, బండి రమేశ్, లెంకల రాజిరెడ్డి, జూపాక నీలంబరం ఉన్నారు.

'కిసాన్ క్రెడిట్ కార్డు'ను సద్వినియోగం చేసుకోవాలి

మహాదేవపూర్, నవంబర్ 5 : కిసాన్ క్రెడిట్ కార్డు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల పశు వైద్యుడు రాజబాపుగౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో రైతులకు సూచించారు. పశు సంపద ఉన్న ప్రతి రైతు రూ.1.60 లక్షల వరకు ఎలాంటి సెక్యూరిటీ లేకుండా కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా బ్యాంకు నుంచి రుణం పొందవచ్చన్నారు. పాడి పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకదారులై ఉండాలని తెలిపారు. వ్యవసాయ పంట రుణం తీసుకోవాలనుకుంటే రూ. 3 లక్షల వరకు పొందవచ్చన్నారు. అందులో రూ.1.60 లక్షల వరకు పాడి పశువులు, కోళ్ల పెంపకానికి అప్పు తీసుకోవచ్చని వివరించారు. మండలంలోని రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు.

గుడిసెలను కూల్చడం సరికాదు

ములుగురూరల్, నవంబర్ 5 : ప్రజా పాలన పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి పేద ప్రజల గుడిసెలను కూల్చడం ఎంత వరకు సమంజసమని ఏఐకేఎంకేఎస్ కార్యవర్గ సభ్యుడు ప్రసాదన్న అన్నారు. ములుగు జిల్లా కేంద్రంలో ఆయన రైతు కూలీ సంఘం కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇంచర్ల గ్రామ శివారులోని అంబేద్కర్‌నగర్‌లోని గుడిసెలను గత నెల 26న తొలగించారని అన్నారు. గుడిసెలు కోల్పోయిన 260మంది బాధితులకు ఎర్రి గట్టమ్మ పరిసర ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ భూమిలో ఇండ్ల స్థలాలను అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రైతు కూలీ సంఘం కార్యవర్గ సభ్యుడు బానోత్ నరసింహులు, పల్నాటి మొగిలి తదితరులు పాల్గొన్నారు.

జెన్కోలో ఉద్యోగాలు కల్పించాలి

మల్హర్, నవంబర్ 5 : జెన్కోలో తమకు ఉద్యోగావకాశాలు కల్పించాలని సీఈ శ్రీప్రకాశ్‌ను తాడిచర్ల, కాపురం గ్రామాల భూ నిర్వాసితులు కోరారు. మంగళవారం జెన్కో భూ నిర్వాసితుల హక్కుల సాధన పోరాట కమిటీ ఆధ్వర్యంలో వారు సీఈని కలిసి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ బొగ్గు తవ్వకాల కోసం భూ సేకరణ చేస్తున్న సమయంలో జెన్కో అధికారులు గ్రామస్తులు, రైతులతో సమావేశం ఏర్పాటు చేసి తాడిచర్ల గ్రామ నిరుద్యోగులకు మూడు వేల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగావకాశాలు కల్పించి తమ కుటుంబాలను ఆదుకోవాలని సీఈని కోరారు. డేంజర్ జోన్‌లో తమ ఇండ్లు ఉన్నందున సురక్షిత ప్రాంతాలకు తరలించాలని విన్నవించారు. భూ నిర్వాసితుల హక్కుల సాధన పోరాట కమిటీ అధ్యక్షుడు కేసారపు రవి, కమిటీ కార్యదర్శి తాండ్ర సంతోష్‌కుమార్, ఇందారపు ఎల్లయ్య పాల్గొన్నారు.

ఓసీ-3 ప్రాజెక్టును పరిశీలించిన నూతన జీఎం

గణపురం, నవంబర్ 5 : మండలంలోని ఓసీ-3 ప్రాజెక్టు కార్యాలయాన్ని మంగళవారం జీఎం రాజశేఖర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించి ప్రాజెక్టు స్థితిగతులను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. ఉపరితల గని ఉత్పత్తి, ఉత్పాదకత, రవాణా తదితర అంశాల వివరాలు, భూ సేకరణకు సంబంధించిన వివరాలపై అధికారులతో చర్చించారు. అనంతరం ఓసీ-3 క్రషర్ సైట్‌ను సందర్శించి వ్యూ పాయింట్ ద్వారా గనిలో జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. గని అభివృద్ధికి కావాల్సిన ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం కవీంద్ర, ప్రాజెక్ట్ మేనేజర్ భానుప్రసాద్, ఆపరేషన్స్ మేనేజర్ శ్రీనివాస్, ప్రాజెక్ట్ ఇంజినీర్ అరుణ్ ప్రసాద్, ఏరియా సర్వే ఆఫీసర్ దయాకర్, ఎస్టేట్ ఆఫీసర్ కార్తీక్, సీనియర్ సర్వే ఆఫీసర్ కుమారస్వామి, సర్వే ఆఫీసర్ మన్నన్, ఏరియా అధికార ప్రతినిధి, అధికారులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లా స్థాయికి విద్యార్థి ఎంపిక

గణపురం, నవంబర్ 5 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలో భాగంగా మంగళవారం మండలస్థాయిలో జరిగిన ఖోఖో అండర్ -17 విభాగంలో చెల్పూర్ ఎంజీఎం హైస్కూల్ విద్యార్థి రాసమల్ల సిద్ధార్థ ఎంపికయ్యారు. వ్యాయామ ఉపాధ్యాయులు మోహన్, రమేశ్, విద్యార్థి సిద్ధార్థను కరస్పాండెంట్ గ్యాదంగి సతీశ్, డైరెక్టర్లు గ్యాదంగి తిరుపతి, గ్యాదంగి రమాదేవి, సిలువేరు శ్రీనివాస్, ప్రిన్సిపాల్ మధుకర్ అభినందించారు.

రోడ్డు విస్తరణ పనులు వెంటనే పూర్తి చేయాలి

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

మురుగు నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జీఎస్ఆర్

కృష్ణకాలనీ, నవంబర్ 5 : అంబేద్కర్ సెంటర్ నుంచి కేటీకే-2 ఇంక్లైన్ వరకు చేస్తున్న రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మంగళవారం ఆయన రోడ్డు, డ్రైనేజీ పనులను పరిశీలించారు. ముందుగా జిల్లా కేంద్రంలోని డ్రైనేజీ లీకేజీ సుభాష్ కాలనీ రోడ్డు పాడవుపై ప్రవహిస్తుండటంతో పాటు రెడ్డికాలనీ, ఎల్బీనగర్ కాలనీ వాసులకు డ్రైనేజీ దుర్వాసన వస్తుండడంతో ఈ మురికి నీరంతా ఎక్కడి నుంచి వస్తుందంటూ అధికారులు, స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ డ్రైనేజీ వ్యవస్థ గాడిలో పడేలా అంబేద్కర్ సెంటర్ నుంచి సుభాష్‌కాలనీ మీదుగా టు ఇంక్లైన్ క్రాస్ వరకు అంతర్గత డ్రైనేజీతో పాటు ఓపెన్ డ్రైనేజీలను నిర్మించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఏదైనా సమస్య ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అభివృద్ధి పనులకు చిరు వ్యాపారుల డబ్బాలు ఉంటే వారికి నోటీసులు ఇచ్చి తొలగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా మురుగు నీరు రోడ్డుపై ప్రవహించకుండా అత్యవసర పనులను చేపట్టాలని శానిటరి ఇన్‌స్పెక్టర్ నవీన్‌ను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్, పంచాయతీరాజ్ ఇంజినీర్లు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజలపై పెద్దమ్మ తల్లి ఆశీస్సులు ఉండాలి

విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదనాచారి

మొగుళ్లపల్లి, నవంబర్ 5 : పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి, శాసన మండలి ప్రతిపక్ష నేత, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి ఆకాంక్షించారు. మంగళవారం మండలకేంద్రంలో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో వారు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్మాణానికి తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు సహకారం అందించానని గండ్ర తెలిపారు. ముదిరాజ్‌ల సంక్షేమానికి కేసీఆర్ ఉచిత చేప పిల్లలు పంపిణీ చేసి ఆర్థికంగా ఆదుకున్నారన్నారు. కానీ, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడిప్పుడే చేప పిల్లల పంపిణీ చేపడుతున్నదని ఎద్దేవా చేశారు. సిరికొండ మాట్లాడుతూ ఆలయాన్ని సుందరంగా నిర్మించారని ఆలయ కమిటీని అభినందించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ జోరుక సదయ్య, చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొడాలి రమేశ్, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు చదువు అన్నారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ నర్సింహారెడ్డి, మాజీ సర్పంచులు నైనకంటి ప్రభాకర్‌రెడ్డి, దానబోయిన రాములు, పెంతల రాజేందర్‌రెడ్డి, నరహరి వెంకట్‌రెడ్డి, ముడుపు రవీందర్‌రెడ్డి, గడ్డం రాజు, ఆలయ కమిటీ చైర్మన్ కందుల సమ్మయ్య, రావిచెట్టు రమేశ్, దేవుని కుమార్, కందుల చంద్రయ్య పాల్గొన్నారు.

కాటారం గిరిజన బాలుర కళాశాలలో దొంగతనం

నిందితుడి అరెస్టు, ఎల్ఈడీ టీవీ స్వాధీనం

కాటారం, నవంబర్ 5 : మండలకేంద్రంలోని గిరిజన బాలుర సంక్షేమ కళాశాలలో సోమవారం దొంగతనం జరిగింది. ఈ ఘటనపై కళాశాల ప్రిన్సిపాల్ రాజేందర్ కాటారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఒక రోజు వ్యవధిలోనే సీసీ పుటేజీల సాయంతో దొంగను గుర్తించి అరెస్టు చేశారు. ఎస్సై అభినవ్ మంగళవారం వివరాలు వెల్లడించారు. ఈనెల 3న రాత్రి గిరిజన ఆశ్రమ కళాశాల తాళం పగులగొట్టి రూ.66వేల విలువైన ఎల్ఈడీ టీవీని ఎత్తుకెళ్లారు. సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించగా మండలకేంద్రంలోని గంటగూడెంకు చెందిన గంట పరిపూర్ణం నిందితుడిగా గుర్తించి అరెస్టు చేసి టీవీని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కాగా, 2022లో ట్రాక్టర్ బ్యాటరీ దొంగతనం కేసులో పరిపూర్ణం నిందితుడని, అలాగే గత ఏప్రిల్‌లో గంజాయి కేసులో జైలుకు వెళ్లి ఇటీవల బెయిల్‌పై బయటకు వచ్చాడన్నారు. జల్సాల కోసం దొంగతనాలు చేస్తున్నట్లు విచారణలో పరిపూర్ణం అంగీకరించినట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీస్ సిబ్బంది లవన్, సంపత్, నాగరాజు, రఘు, నరేష్, హోంగార్డులు తిరుపతి, రాజశేఖర్‌ను ఆయన అభినందించారు.

వడ్డీ వ్యాపారుల బరితెగింపు..!

'నమస్తే'కు వాయిస్ ఇచ్చిన వ్యక్తికి బెదిరింపులు

వాజేడు, నవంబర్ 5 : వాజేడు, వెంకటాపురం (నూగూరు) మండలాల్లోని వడ్డీ వ్యాపారులు బరితెగిస్తున్నారు. ఈ నెల 4న 'నమస్తే తెలంగాణ'లో 'నడ్డి విరుస్తున్న వడ్డీ' కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే.. దీనిని జీర్ణించుకోలేని కొందరు ఫైనాన్స్ వ్యాపారులు ఈ కథనానికి వాయిస్ ఇచ్చిన కొప్పునూరు గ్రామానికి చెందిన సాధనపల్లి సుధీర్‌కు ఫోన్ చేసి బెదిరించినట్లు బాధితుడు 'నమస్తే'కు తెలిపాడు. చెరుకూరు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఫైనాన్స్ వ్యాపారులను అవసరం నిమిత్తం డబ్బులు అడుగగా 'మాపై వార్త వచ్చింది' అని నమస్తేకు వాయిస్ ఇచ్చిన సుధీర్ నంబర్ ఇవ్వడం గమనార్హం. అంతేకాకుండా 'నా ఫొటోతో ఎలా వార్తా రాశాడు.. పోలీసులకు ఫిర్యాదు చేసుకోండి.. మాకు ఏంకాదు' అని బెదిరించినట్లు సుధీర్ ఆవేదన వ్యక్తం చేశాడు. ఉన్నతాధికారులు స్పందించి బెదిరింపులకు పాల్పడుతున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.

తహసీల్దార్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు


తహసీల్దార్‌ను సన్మానిస్తున్న నాయకులు

తాడ్వాయి, నవంబర్ 5 : తాడ్వాయి తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన గిరిబాబును మంగళవారం మండల బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. మండల పార్టీ అధ్యక్షుడు మల్లయ్య ఆధ్వర్యంలో తహసీల్దార్‌ను సన్మానించారు. నాయకులు మోహన్‌రావు, రమణయ్య, ఇంద్రారెడ్డి, బాబురావు, కృష్ణ, చంద్రం, వసంతరావు, గౌరమ్మ పాల్గొన్నారు.

మంగపేట:నాగులమ్మ పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ఘనంగా నాగుల చవితి

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్ : ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో నాగుల చవితి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. నాగులమ్మ ఆలయాల్లో భక్తులు పూజలు చేసి పాలు, గుడ్లు, పండ్లు పుట్టలో వేసి మొక్కులు చెల్లించుకున్నారు. నాగేంద్రస్వామికి పంచామృతాలతో అభిషేకం చేశారు. కొందరు ఉపవాస దీక్షలు చేపట్టారు. ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి.

స్కానింగ్ సెంటర్ తనిఖీ

ములుగురూరల్, నవంబర్ 4 : ములుగు జిల్లా కేంద్రంలోని సరళ స్కానింగ్ సెంటర్‌ను డిప్యూటీ డీఎంహెచ్‌వో విపిన్‌కుమార్, జిల్లా మాతాశిశు సంరక్షణ, పోషకాహార ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్ బృందం సోమవారం తనిఖీ చేశారు. రికార్డులను, బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ఫైర్ సర్టిఫికెట్, ధరల పట్టిక, డాక్టర్ వివరాలు డిస్‌ప్లే వంటి లోపాలను గమనించి స్కానింగ్ మేనేజ్‌మెంట్‌కు నోటీసులు అందించారు. వారి వెంట సిబ్బంది సంపత్, దుర్గారావు ఉన్నారు.

ఎస్సైని కలిసిన జీపీ మండల కమిటీ

వాజేడు, నవంబర్ 5 : మండలకేంద్రంలోని పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఎస్సై రుద్రరాపు హరీశ్‌ను నూతన గ్రామపంచాయతీ సిబ్బంది మండల కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. పారిశుధ్య పనుల్లో వారు ఎరుర్కొంటున్న సమస్యలను ఎస్సైకి వివరించారు. తమ విధులకు ఆటంకం కలిగిస్తే చర్యలు తీసుకోవాలని ఎస్సైని కోరారు. అనంతరం ఎస్సైని సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కంబాలపల్లి కొండయ్య, ఉపాధ్యక్షుడు బొగ్గం బాబు, జిల్లా కమిటీ సభ్యులు పొదిల సత్యనారాయణ, కార్యదర్శి బాలుసుపాటి రామయ్య, చెన్నం ఆదినారాయణ పాల్గొన్నారు.

కోయభాషను మాతృభాషగా నమోదు చేయించాలి

ఏటూరునాగారం, నవంబర్ 5 : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే కులగణనలో ఆదివాసీలు మాతృభాషను సీరియల్ నంబర్ 5లో కోయ భాషగా నమోదు చేయించాలని తుడుందెబ్బ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎట్టి ప్రకాశ్ కోరారు. మండలంలోని శివ్వాపూర్ పంచాయతీ పరిధిలో మంగళవారం నిర్వహించిన తుడుందెబ్బ సమావేశంలో ప్రకాశ్ పాల్గొని మాట్లాడారు. గోదావరి పరీవాహక ప్రాంతంలోని 12జిల్లాల 9 తెగల ఆదివాసీల అస్తిత్వాన్ని కాపాడాలని ఆయన కోరారు. సమావేశంలో మాజీ సర్పంచ్ వంక దేవేందర్, తుడుందెబ్బ నాయకులు, గొప్ప నవీన్, అట్టం సమ్మయ్య, నాగేశ్వర్‌రావు, సందీప్, నర్సింగారావు, అన్నమయ్య, సమ్మయ్య, ప్రేమ్, రవి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం చేయాలి

వాజేడు, నవంబర్ 5 : సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని ఆశ కార్యకర్తలకు వైద్యాధికారి కొమురం మహేందర్ సూచించారు. మండలకేంద్రంలోని పీహెచ్‌సీ ఆవరణలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో గర్భవతులను గుర్తించి ప్రసవం కోసం పీహెచ్‌సీలకు తీసుకురావాలని సూచించారు. వైద్యాధికారులు మధుకర్, జ్ఞానస, హెల్త్ సూపర్‌వైజర్స్ కోటిరెడ్డి, వెంకటరమణ, ఏఎన్ఎం నాగేంద్రకుమారి, సత్య నాగవేణి, ఛాయదేవి, లలితకుమారి, రాజేశ్వరి, హెల్త్ అసిస్టెంట్లు చిన్నవెంకటేశ్వర్లు, శేఖర్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ములుగురూరల్, నవంబర్ 5 : రైతులు పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ వైస్‌చైర్మన్ మర్రి రాజు అన్నారు. సోమవారం కాసిందేవిపేట గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే ధాన్యాన్ని విక్రయించి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలని సూచించారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ అహ్మద్‌పాషా, చాంద్‌పాషా, రమేశ్, మొండయ్య, రాజ్‌కుమార్, నరేశ్, రాములు, రైతులు ఉన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన

కాటారం, నవంబర్ 5 : ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనపై అవగాహన కలిగి ఉండాలని మహదేవపూర్ ఐసీటీసీ కౌన్సిలర్ గాదె రమేశ్ అన్నారు. ఆశ దినోత్సవం సందర్భంగా మంగళవారం కాటారం పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్ మౌనిక ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలకు రమేశ్ అవగాహన కల్పించారు. ప్రతి గర్భిణికి హెచ్ఐవీ పరీక్షలు చేయించాలని సూచించారు. సుఖ రోగాలు, టీబీ ఉన్న వారికి తప్పనిసరిగా పరీక్షలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో తిరుపతిరెడ్డి, సీహెచ్‌వో నిర్మల, సూపర్‌వైజర్లు పద్మావతి, సరళ, టీబీ సూపర్‌వైజర్ రమేశ్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠకులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

ములుగురూరల్, నవంబర్ 5 : ములుగు జిల్లాలోని గ్రంథాలయాల్లో పాఠకులకు ఎలాంటి ఇబ్బందులు తలత్తకుండా చూడాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. రోజు వారీగా గ్రంథాలయానికి వస్తున్న వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పుస్తకాల వివరాలపై ఆరా తీశారు. నిరుద్యోగులు, విద్యార్థులకు కావాల్సిన అవసరాలను మంత్రి సీతక్క, రాష్ట్ర చైర్మన్ రియాజ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించనున్నట్లు తెలిపారు. గ్రంథాలయ అధికారులు, ఉద్యోగులు, మండల ఉద్యోగులు పాల్గొన్నారు.

పేకాడుతున్న ఐదుగురిపై కేసు

భూపాలపల్లి రూరల్, నవంబర్ 5: పేకాడుతూ పట్టుబడిన ఐదు గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ నరేశ్‌కుమార్ మంగళవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. జవహర్ నగర్ కాలనీలో కొంతమంది వ్యక్తులు పేకాడుతున్నారనే సమాచారం మేరకు మాలోతు రవి ఇంటిపై దాడి చేసినట్లు చెప్పారు. నూనేటి కుమార స్వామి, పోతురాజు సురేశ్, జంగేటి మల్లయ్య, వెంపటి సురేందర్, మాలోత్ రవి పట్టుబడినట్లు తెలిపారు. వారి వద్ద రూ. 22,110 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు.. ఒకరికి తీవ్ర గాయాలు

కాటారం, నవంబర్ 5 : ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీ కొన్న ఘటనలో కాటారం గ్రామానికి చెందిన కొండగొర్ల సమ్మయ్య తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. సమ్మయ్య పత్తి చేనుకు వెళ్లేందుకు బైక్‌పై ఇంటి నుంచి వెళ్తున్నాడు. పెట్రోల్ పోయించుకోవడానికి పెట్రోల్ పంప్ వైపు వాహనాన్ని తిప్పుతుండగా గోదావరిఖని డిపోకు చెందిన బస్సు వెనకాల నుంచి వచ్చి ఢీకొని కొంత దూరం లాక్కెళ్లింది. వాహనం బస్సు కింద ఇరుక్కుపోగా సమ్మయ్య రెండు టైర్ల మధ్య పడటంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో దవాఖానకు తరలించారు.

ఏటీసీ నిర్మాణ పనులు ప్రారంభం

కాటారం, నవంబర్ 5 : మండలకేంద్రంలోని సర్వే నంబర్ 49లోగల తిమ్మన్నకుంటలో ఏటీసీ(అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్) కోసం కేటాయించిన ఎకరం స్థలంలో నిర్మాణ పనులకు మంగళవారం ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. నిర్మాణ సంస్థ సైట్ ఇంజినీర్లు, సిబ్బంది, ఐటీఐ ప్రిన్సిపాల్, శిక్షకులు సర్వే పనులు చేయించారు. డీజీపీఎస్ సర్వే చేయించి పిల్లర్లు పోయడానికి జ